
www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 18 డిసెంబర్ 2024
5
తిరుపతి



వేదిక్ వర్సిటీలో చిరుత సంచారం

క్యాంపస్ :తిరుపతిలోని స్థానిక శ్రీ వేంకటేశ్వర వేదిక్ విశ్వవిద్యాలయంలో చిరుత సంచారంతో విద్యార్థులు సిబ్బంది భయాందోళనకు గురయ్యారు. వేదిక్ వర్సిటీలోనే కాకుండా వ్యవసాయ కళాశాల, శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయం, శ్రీ వేంకటేశ్వర విద్యాలయాల పరిసర ప్రాంతాల్లో కూడా చిరుత సంచరించినట్లు విద్యార్థులు ఎస్వీయూ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఏసియుసిఐ అటవీ శాఖ అధికారులు పోలీసులతో చిరుత సంచరించిన పలు ప్రదేశాలను వారు పరిశీలించారు. ఇందులో భాగంగా అటవీ శాఖ అధికారులు ఎస్వీయూ, వేదిక్ వర్సిటీ ప్రాంగణాలలో చిరుత సంచారం గుర్తులను పరిశీలించారు. చిరుత సంచరించిన ప్రదేశాలలో అక్కడక్కడ సిసి కెమెరాలు అమర్చి వారం రోజులు పర్యవేక్షించి పరిశీలిస్తామని, చిరుత కదిలికలపై దృష్టి సారించి బోనులు ఉపయోగించి పట్టుకునేందుకు ప్రయత్నిస్తామని అటవీశాఖ అధికారులు వెల్లడించినట్లు విద్యార్థులు తెలిపారు.

సాగుబడి.. కంటతడి..!

పొంచివున్న ఇంకో తుపాను ముప్పు

ఇప్పటికే వేలాది ఎకరాల వరి నారు మునక

వందల ఎకరాల్లో బురద, ఇసుక మేటలు


వర్షానికి పొలాల్లో ఇసుక మేటలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఈ సారి వర్షాలు సమృద్ధిగా పడడంతో రబీలో కష్టాన్ని గట్టెక్కుదామనుకున్న రైతన్న ఆశలపై వరుస తుఫానులు నీళ్లు చల్లాయి. పెంగల్ తుపాను ప్రభావంతో తూర్పు మండలాల్లో ఈ నెల మొదటి వారంలో విస్తారంగా వర్షాలు కురిసాయి. చాలా గ్రామాల్లోని చెరువులకు నీరు చేరింది. ముమ్మరంగా వరి నాట్లు సాగాయి. అయితే ఆ తరువాత కురిసిన భారీ వర్షాలకు వరి పంటలు నీట మునిగాయి. ఆ కష్టం నుంచి బయట పడకముందే అల్పపీడన ప్రభావంతో ఏర్పడ్డ తుపాను కారణంగా ఈ నెల రెండో వారంలో కురిసిన భారీ వర్షాలకు పలు చోట్ల చెరువులకు గండ్లు పడ్డాయి. వందల ఎకరాల్లో బురద, ఇసుక మేటలు ఏర్పడ్డాయి. వేల ఎకరాల్లో వరి పంట నీట మునిగింది. ఆ కష్టం మిగిల్చిన రైతు కంట తడి ఆరకముందే మరో అల్పపీడన ప్రభావంతో తుపాను ముప్పు పొంచి ఉందని వాతావరణ శాఖ చెబుతోంది. ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడన ద్రోణి కారణంగా భారీ వర్షాలు పడే అవకాశాలు ఉండడంతో తూర్పు మండలాల రైతులు మరింత ఆందోళనకు గురవుతున్నారు.


50 వేల ఎకరాల్లో వరికి ముప్పు

శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖ డివిజన్ పరిధిలో తూర్పు మండలాల్లో ఈ సారి రబీ సీజన్‌లో 50 వేల ఎకరాల్లో వరి సాగుకు వ్యవసాయ అధికారులు రైతులను సన్నద్ధం చేశారు. ఇప్పటికే 75 శాతం మేర వరి నాట్లు పడ్డాయి. చాలా చోట్ల ప్రాథమిక, కొన్ని గ్రామాల్లో పొట్ట దశలో వరి పంటలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వరుస తుపానుల వల్ల లోతట్టు పొలాల్లో భారీగా ముంపు నీరు చేరడంతో వరి పైరు కుళ్లిపోయింది. పొలాల్లో రోజుల తరబడి నీరు నిలిచింది. రామాపురం చెరువుకు గండి పడడంతో 20 ఎకరాల్లో బురద మేటలు ఏర్పడ్డాయి. వరద నీటి ఉదతికి ఏర్పేడు మండలంలోని చింతలపాలెంలో సుమారు 30 ఎకరాల్లో వరి పొలాలు కోతకు గురయ్యాయి. తొట్టంబేడు, కేవీబీపురం, బీఎన్ కండ్రిగ మండలాల్లో వరి పొలాలు ఇంకా మునకలోనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఇప్పుడిప్పుడే పంట పొలాలు ఆరుదలకు వస్తున్నాయి. కొన్నిచోట్ల పంట తిరగ దున్ని మళ్లీ సాగు చేసేందుకు రైతులు సమాయత్తమవుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో ఈ నెల 17 నుంచి 19వ తేదీ వరకు జిల్లాకు మూడు రోజుల పాటు భారీ వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం ప్రకటించింది. దీంతో కర్షకుల్లో మళ్లీ కలవరం మొదలైంది. తేలికపాటి జల్లులు పడితే పెద్ద నష్టం ఉండకపోవచ్చునీ, 50 మి.మీకు మించి వర్షపాతం నమోదైతే మాత్రం వరి పంటలకు సైతం భారీ నష్టం వాటిల్లనుందని ఆందోళన చెందుతున్నారు.

నష్టం అంచనా.. పరిహారం మిథ్య!

శ్రీకాళహస్తి వ్యవసాయ శాఖా డివిజన్ పరిధిలోని చాలా గ్రామాల్లో వరి పొలాలు మునకకు గురై పైరు చనిపోయింది. అయితే మునక నష్టం అంచనా వేసి రైతులకు విత్తనాలు, పరిహారం అందించడంలో జాప్యం జరుగుతోందన్న విమర్శలు వస్తున్నాయి. సాధారణంగా వరి పంట మునకకు గురై పైరు చనిపోతే ప్రభుత్వం రైతుకు విత్తనాలు ఉచితంగా అందజేయాల్సి ఉంటుంది. అయితే ఇక్కడే ప్రభుత్వం మెలిక పెడుతోంది. తాము ఇచ్చిన విత్తనాలే పండించాలనీ, తాము చెప్పినప్పుడే ప్రభుత్వానికి ధాన్యం అమ్ముకోవాలంటూ నిబంధన పెట్టడంతో రైతులు పంట నష్టం వెళ్ళడించేందుకు ముందుకురాని పరిస్థితి. ఇక ఇసుక, బురద మేటల నష్టంపై అధికారులు ఇంకా అంచనా వేస్తున్నారు. పరిహారం కోసం రెండు నెలలు ఆగాలంటున్నారు. దీంతో పంట నష్టం అంచనా..పరిహారం అందేది మిథ్యేనని రైతులు లబోదిబోమంటున్నారు.

నాలుగెకరాలు కోతకు: వెంకటముని, కౌలు రైతు, చింతలపాలెం



నాలుగెకరాలు కౌలుకు తీసుకుని వరి పంట వేశా. రూ. 30 వేల దాకా పెట్టుబడి ఖర్చు అయినది. రెండు వరస తుపానుల వల్ల పైరుపై ముంపు నీరు ప్రవహించి కొట్టుకుపోయింది. పొలం కోతకు గురైంది. ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం లేదు.

విత్తనాలు అందించేందుకు సిద్ధం: రమేష్, ఏడిఏ, శ్రీకాళహస్తి

మునక వల్ల వరి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. వారికి ఉచితంగా వరి విత్తనాలు అందజేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. ఇసుక మేటలు, పంట నష్టం పై అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నాం.

19 వరకూ ఎఫెక్ట్

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో



భారీ వర్షాలు జిల్లాను ముంచెత్తుతున్నాయి. నవంబర్, డిసెంబర్ నెలల్లో బంగాళాఖాతంలో అల్పపీడనాలు ఏర్పడటం సహజమే అయినప్పటికీ ఇప్పుడు దీని తీవ్రత మరింత పెరిగింది. మొన్నటివరకు భారీ వర్షాలతో అతలాకుతలమైంది తమిళనాడు. దాదాపుగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లోనూ అతి భారీ వర్షాలు కురిసాయి. బీభత్సాన్ని సృష్టించాయి. అక్కడి రిజర్వాయర్లు, భారీ, మధ్య, చిన్న తరహా నీటి ప్రాజెక్టులు వరదనీటితో తొణికిసలాడుతున్నాయి. ఈ పరిస్థితికి ఇప్పట్లో బ్రేకులు పడకపోవచ్చు. మరో విడత భారీ వర్షాలు పొంచివున్నాయి.

తాజాగా బంగాళాఖాతం ఆగ్నేయ దిశగా ఏర్పడిన ఉపరితల ఆవర్తనం మరింత బలపడింది. సోమవారం సాయంత్రానికి అల్పపీడనంగా మారినట్లు చెన్నైలోని ప్రాంతీయ భారత వాతావరణ కేంద్రం తెలిపింది. క్రమంగా ఇది వాయవ్య దిశగా కదులుతుందని, తమిళనాడు తీరం వెంబడి దీని కదలికలు ఉండొచ్చని అంచనా వేసింది. ఈ ప్రభావంతో తమిళనాడు వ్యాప్తంగా భారీ నుంచి అతి భారీ వర్షాలు పడతాయని వాతావరణ కేంద్రం వెల్లడించింది. నేటి నుంచి రెండు రోజుల పాటు అంటే- ఈ నెల 19వ తేదీ వరకు చెన్నై సహా తీర ప్రాంత జిల్లాల్లో అతి భారీ వర్షపాతం నమోదవుతుందని పేర్కొంది. లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మత్స్యకారులు సముద్రంపై చేపలవేటకు వెళ్లకూడదని సూచించింది. గురువారం వరకు బలమైన ఈదురుగాలులు వీస్తాయి. వీటి తీవ్రత గంటకు 35 నుంచి 45 కిలోమీటర్ల వరకు ఉంటుంది. గరిష్ఠంగా 55 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీయడానికి అవకాశం ఉంది. కేప్ కొమొరిన్ ఏరియా పరిధిలోకి వచ్చే కన్యాకుమారి, గల్ఫ్ ఆఫ్ మన్నార్ పరిధిలోని మన్నార్ ఐలండ్, పంబన్ ఐలండ్‌ల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని చెన్నై ఆర్ఎండీ వెల్లడించింది.ఈ ప్రభావం ఏపీ దక్షిణ ప్రాంతం, రాయలసీమపైనా తీవ్రంగా ఉండటం ఖాయంగా కనిపిస్తోంది. నేడు నెల్లూరు, అన్నమయ్య రాయచోటి, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉంది. దీని తీవ్రత 19వ తేదీ వరకు కొనసాగే అవకాశం ఉంది

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి : ఎంఎల్‌సి



ప్రజాశక్తి -తిరుపతి సిటి, గూడూరు టౌన్

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంఎల్‌సి డాక్టర్ సిపాయి సుబ్రమణ్యం హామీ ఇచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో అఖిలభారత పెన్షనర్ల దినోత్సవం, సన్మాన కార్యక్రమం మంగళవారం తిరుపతి ఆఫీసర్స్ క్లబ్బు కాన్ఫరెన్స్ హాల్లో ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, శాసనమండలి సభ్యులు డాక్టర్ సిపాయి సుబ్రహ్మణ్యం హాజరయ్యారు. మార్కొండ రెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. ప్రభుత్వం ప్రతినెల టంచనుగా పెన్షన్ ఇవ్వడం, ప్రభుత్వం ఆధ్వర్యంలో వైద్య సహాయం, ఆర్థిక ఇబ్బందులు లేకపోవడం, ప్రశాంతంగా జీవనంతో ఆయుష్షు ప్రమాణం పెరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో 23వ డివిజన్ కార్పొరేటర్ రామస్వామి వెంకటేశ్వర్లు, విశ్రాంత ఉద్యోగి డి.ఎస్.పి లక్ష్మీ రెడ్డి పాల్గొన్నారు.

గూడూరు టౌన్‌లో... రిటైర్డ్ ఎంప్లాయీస్ భవనంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర పిఆర్ డిప్లొమా ఇంజినీర్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు షేక్ రియాజ్ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవం జరిగింది. ఎంఎల్ఏ పాశిం సునీల్‌కుమార్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగులకు సంబంధించిన భూములు ఎవరైనా ఆక్రమించినా, వారికి ఇబ్బందులు కలిగించినా కఠిన చర్యలు తప్పవన్నారు. స్టేట్ వైస్ ప్రెసిడెంట్ షేక్ మహబూబ్ బాషా, ప్రధాన కార్యదర్శి ఎన్ మోహన్, అసిస్టెంట్ ట్రెజరీ బి శ్రీనివాసులు, ఎస్బిఐ రీజనల్ మేనేజర్ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలో ఆధార్ నమోదు కోసం నగరంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆధార్ లేదని తెలిపారు. నగరంలో ఆధార్ లేని 0-6 సంవత్సరాల వయస్సు గల పిల్లలకు ఆధార్ నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేశామని అన్నారు. డిసెంబరు 2024లో ఆధార్ కార్డులు మొదటి దశలో డిసెంబర్ 17 నుండి 21 వరకు, రెండవ దశలో 26 నుండి 28 డిసెంబర్ వరకు నిర్వహిస్తామని అన్నారు. నగరంలోని అంగన్వాడీ సెంటర్ దోబీ కాలనీ, భగత్ సింగ్ కాలనీ, సప్తగిరి నగర్, భవానీ నగర్, యశోధ నగర్, పూసల వీధి, వినాయక నగర్, తాతానగర్, ఎస్.టి.వి.నగర్, నవాబుపేట ప్రాంతాల్లో ఏర్పాటు చేశామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ ప్రజలను కోరారు.



డిపో మేనేజర్‌పై విచారణ జరపాలి: ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి - గూడూరు టౌన్

గూడూరు డిపో కండక్టర్, డ్రైవర్లను అక్రమంగా సస్పెండ్ చేసిన డిపో మేనేజర్‌పై ఉన్నతాధికారులు తక్షణం విచారించి, చర్యలు తీసుకోవాలని ఎస్‌డబ్ల్యుఎఫ్ జిల్లా కార్యదర్శి ఈ.శివకుమార్ డిమాండ్‌చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ డిపో ఎదుట రిలే నిరాహారదీక్ష మంగళవారానికి ఆరో రోజుకు చేరుకుంది. దీక్షల్లో పి.మాల్యాద్రి, కె.కృష్ణయ్య కూర్చున్నారు. ఈ.శివకుమార్ మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యుత్ బస్సులు రాబోతున్నాయని, ప్రైవేట్ కార్మికులు వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వ ఉద్యోగుల సంఖ్య తగ్గేందుకు సంకేతాలు కనిపిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా ఇతర సంఘాల సభ్యులు కలసికట్టుగా ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో కెఎస్ వాసు, ఎం.శేషయ్య, ఎస్ఎస్‌వి కృష్ణ పాల్గొన్నారు.

బంగ్లాదేశ్‌లో హిందువులకు రక్షణ కల్పించాలి

ప్రపంచ మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సదస్సు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

గత కొన్ని రోజులుగా బంగ్లాదేశ్ లోని మైనారిటీ హిందువులు, బౌద్ధులు, క్రైస్తవులపై జరుగుతున్న దాడులను నివారించాలని, వారికి రక్షణ కల్పించాలని వక్తలు డిమాండ్ చేశారు. తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రంలో సిఐటియు ఆధ్వర్యంలో ప్రపంచ మైనార్టీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం సాయంత్రం సదస్సు నిర్వహించారు. సదస్సుకు సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి అధ్యక్షత వహించారు. విశ్రాంత న్యాయమూర్తి పి. గురప్ప, సీనియర్ జర్నలిస్టు రాఘవ, రాజ్యాంగ పరిరక్షణ వేదిక కన్వీనర్ పి. అంజయ్య, రైతు నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, కార్మిక నాయకులు రాధాకృష్ణ, జి. బాలసుబ్రహ్మణ్యం ప్రసంగించారు.

బంగ్లాదేశ్ లో మతోన్మాద శక్తులు మైనారిటీలపై విరుచుకుపడటం, దాడులకు పాల్పడటాన్ని వారు తీవ్రంగా విమర్శించారు. మెజారిటీ మతం పేరిట ఏ దేశంలోనైనా మైనారిటీలపై దాడులు జరపడాన్ని తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. సెక్యులర్



దేశంగా ఉన్న బంగ్లాదేశ్ లో ఇప్పటివరకు రెండువేల కు పైగా దాడులు హిందువులు, బౌద్ధులపై జరిగాయని ఇది ఆందోళన కలిగించే అంశమని అన్నారు. ప్రపంచం యావత్తు దాడులను తీవ్రంగా ఖండించిందని గుర్తు చేశారు. అణచివేతకు గురయ్యే పీడితులు, బలహీనులకు ప్రజాతంత్ర శక్తులు మొదటి నుంచి అండగా నిలబడుతున్నాయని గుర్తు చేశారు. బంగ్లాదేశ్ లో హిందువులపై దాడిని విమర్శిస్తున్నట్టే, మణిపూర్ లో క్రైస్తవుల పై జరిగిన దాడిని వ్యతిరేకించామని గుర్తు చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బంగ్లాదేశ్ ఘర్షణలను సాకుగా చూపి దేశంలో మత ఉద్రిక్తతలు పెంచడానికి కారణమవుతున్నదని అన్నారు. తిరుపతి నగరంలో మత ఉన్మాదులు అదే పనిగా ఘర్షణలు సృష్టించడమే పనిగా పెట్టుకున్నారని వీరి పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. తిరుపతి నగరం ప్రశాంతతకు మారుపేరుగా ఉన్నదని, తిరుమల శ్రీనివాసుని చరిత్ర మతసామరస్యంతో ముడిపడి ఉందని, అలాంటి చోట అయోధ్య తరహా ఉద్రిక్తతలు సృష్టించడానికి పథకం ప్రకారం బిజెపి, విహెచ్ పి, ఆర్ఎస్ఎస్ వంటి మతోన్మాద శక్తులు ప్రయత్న పూర్వకంగా ఇబ్బందులు సృష్టిస్తున్నాయని విమర్శించారు. ఎస్వీ యూనివర్సిటీలో ప్రొఫెసర్ పై దాడి అమానుషమైందని అన్నారు. ప్రొఫెసర్ చర్యలను తాము సమర్థించడం లేదని, శిక్షించడానికి భజరంగ్ దళ్ కు ఉన్న అర్హత ఏంటని ప్రశ్నించారు. విద్యాలయాల్లో జొరబడి దాడులకు పాల్పడుతూ ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న తిరుపతి నగరాన్ని మత ఉద్రిక్తతలకు కేంద్రంగా మార్చాలనుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని హెచ్చరించారు. మత ఉన్మాదుల పట్ల తిరుపతి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ప్రతిష్టాత్మకమైన టీటీడీ లాంటి ఆధ్యాత్మిక సంస్థలను కాపాడుకోవాలని వారు పిలుపునిచ్చారు.

జాతీయ రహదారుల నిర్మాణం పూర్తవ్వాలి : కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

జాతీయ రహదారులు, రైల్వే ప్రాజెక్టు పనులు మరింత వేగవంతం చేయాలని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. తిరుపతి రేణిగుంట బైపాస్‌రోడ్డుకు సంబంధించిన పలు భూసంబంధిత పెండింగ్ అంశాలపై, నిర్మాణ పనులపై ఎన్‌హెచ్ఎఐ, రెవెన్యూ సంబంధిత అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జేసీ శుభం బన్సల్‌తో కలిసి వర్చువల్ విధానంలో ఎన్‌హెచ్ఎఐ పీడీలు, సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఆర్‌డిఓలు రామ్మోహన్, కిరణ్మయి, భానుప్రకాష్‌రెడ్డిలకు దిశానిర్దేశం చేశారు. జాతీయ రహదారుల నిర్మాణ పురోగతిలో ఉన్న కడప - రేణిగుంట, తిరుపతి - మదనపల్లి, రేణిగుంట-నాయుడుపేట ఆరు లైన్ల రహదారుల నిర్మాణం, తిరుపతి బైపాస్ (కాలూరు క్రాస్ నుంచి రేణిగుంట వరకూ) ఆరు లైన్ల రహదారి పనులు వేగవంతం చేయాలన్నారు. రేణిగుంట నుంచి చెన్నయ్ వరకూ 4 లైన్ల రహదారి విస్తరణ పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నడికుడి- శ్రీకాళహస్తి రైల్వే ప్రాజెక్టు భూసేకరణలో ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. తిరుపతి - పాకాల రైల్వే ట్రాక్ డబుల్ లైన్‌కు సంబంధించిన భూసేకరణ పనుల్లో పురోగతి ఉండాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, ఎన్‌హెచ్ఎఐ పీడీ తిరుపతి వెంకటేష్, నెల్లూరు ఎంకె చౌదరి, చెన్నయ్ రవీంద్రరావు, డిటి భాస్కర్ పాల్గొన్నారు.

ఫ్లెమింగో ఫెస్టివల్ ఘనంగా నిర్వహించాలి

రానున్న ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకలను జిల్లాలో ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ డా ఎస్. వెంకటేశ్వర్, ఎంఎల్ఏ సూళ్లూరుపేట నెలవల విజయశ్రీ సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం కలెక్టర్ ఛాంబర్ నందు ఫ్లెమింగో ఫెస్టివల్ వేడుకల నిర్వహణపై ఎంఎల్ఏ సూళ్లూరుపేట తో కలిసి సంబంధిత అటవీ, పర్యాటక శాఖ అధికారులతో ప్రాథమిక సమావేశం నిర్వహించి ఏర్పాట్లపై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పులికాట్ సరస్సు, నేలపట్టు పక్షుల అభయారణ్యం మన జిల్లాలోని సూళ్లూరుపేట నియోజక వర్గంలో ఉంటూ పలువురు పర్యాటకులను విశేషంగా ఆకట్టుకున్నాయని అన్నారు. ఈ సమావేశంలో కన్సర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ సెల్వం, సూళ్లూరుపేట డిఎఫ్ఓ, పర్యాటక శాఖ రీజనల్ డైరెక్టర్ డా.రమణ ప్రసాద్, జిల్లా పర్యాటకశాఖ అధికారి జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.


ఫ్లెమింగ్ ఫెస్టివల్ నిర్వహణపై కలెక్టర్ సమీక్ష

మహాకుంభ మేళలో పటిష్ట ఏర్పాట్లు : టిటిడి జేఈవో

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ఉత్తర ప్రదేశ్ లోని ప్రయాగ్ రాజ్ (అలహాబాద్)లో జనవరి 13, 2025 నుంచి ఫిబ్రవరి 26, 2025 వరకు జరగనున్న మహాకుంభ మేళలో శ్రీవారి నమూనా ఆలయం ద్వారా ఉత్తరాది భక్తులు స్వామి వారి వైభవాన్ని సంతృప్తిగా తిలకించేలా పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని టిటిడి జేఈవో గౌతమి అధికారులకు సూచించారు. టిటిడి పరిపాలనా భవనంలో సోమవారం జరిగినా సమీక్ష సమావేశంలో టిటిడి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జేఈవో గౌతమి మాట్లాడుతూ టిటిడి ఈవో శ్యామల రావు ఆదేశాల మేరకు 45 రోజుల పాటు సాగే మహాకుంభ మేళకు దాదాపు 2.50 ఎకరాల విస్తీర్ణంలో టిటిడి నుండి విస్తత ఏర్పాట్లు చేస్తోందన్నారు. తిరుమల తరహాలో స్వామి వారి కైంకర్యాలు చేపట్టాలని, శ్రీవారి నమూనా ఆలయానికి కావాల్సిన ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాల దీక్షితులు, డిపిపి సెక్రటరీ రఘునాథ్, డిపిపి ప్రోగ్రాం ఆఫీసర్ రాజగోపాల్ పాల్గొన్నారు.


జేసీబీని వెనక్కి పంపిస్తున్న స్థానికులు

భూ ఆక్రమణను అడ్డుకున్న సిపిఎం


ప్రజాశక్తి - వెంకటగిరి

తిరుపతి జిల్లా వెంకటగిరి మండలంలోని పెట్లూరు గ్రామపంచాయతీ పరిధి సీతారాం ఏచూరి నగర్ సర్వేనెంబర్ 12 లో భూమి ని ఆక్రమించడానికి ప్రయత్నించగా మంగళ వారం ఆక్రమణదారున్ని సిపిఎం నాయకులు వడ్డిపల్లి చెంగయ్య, పేదలు అడ్డుకున్నారు.

ఎంతోకాలంగా పెట్లూరు గ్రామ సర్వేనెంబర్ లో నిరుపేదలు ఇల్లు నిర్మించుకుని ఉన్న విషయం తెలిసిందే. ఆ ప్రాంతానికి ఉత్తరం వైపు ఉన్న స్థలాన్ని ఆక్రమించడానికి ఎల్ల సిరి నరసింహులనే వ్యక్తి జెసిబి తీసుకొచ్చి ఫారెస్ట్‌కు సంబంధించిన వాళ్ళమంటూ హల్‌చల్‌చేశాడు. 2 ఎకరాల 70 సెంట్లకు ట్రెంచ్ సరిహద్దు ఏర్పాటు చేయాలని ఎలాంటి ఆర్డర్స్ లేకపోయినా దౌర్జన్యంతో అక్కడ గుడిసెలు వేసుకున్న మహిళలపై దురుసుగా ప్రవర్తించారు. ఈ విషయాన్ని తెలుసుకున్న సిపిఎం నాయకుడు ఆధారాలు చూపించమని నిలదీసి, జేసీబీని అడ్డుకున్నారు. వెంకటగిరి ఎస్ఐకు ఆక్రమణదారుల గురించి ఫోన్ ద్వారా తెలియజేయగా వెంటనే స్పందించి ఏఎస్ఐను ఘటనా స్థలానికి పంపించారు. భూకబ్జాదారులను వెళ్ళనివ్వకుండా అడ్డుపడి పోలీసులకు అప్పగించారు. భూకబ్జాదారుల వెనక ఉండి నడిపిస్తున్న 'ఆ సార్' ఎవరో తేల్చాలని చెంగయ్య డిమాండ్‌చేశారు.

తల్లికి వందనం పాట ఆవిష్కరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



సలాం సైనిక చిత్రంలోని 'తల్లికి వందనం..సైనిక అంకితం' అనే పాటను శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీ నాయుడు మంగళవారం ఆయన నివాసంలో ఆవిష్కరించారు. చిత్రం నిర్మాత, డైరెక్టర్, హీరో సమక్షంలో సినిమాలోని రెండో పాటలను ఆవిష్కరించి అభినందనలు తెలిపారు. దేశానికి సైనికుల సేవలు నిరుపమానమనీ, స్థానిక యువతను ప్రోత్సహిస్తూ శ్రీకాళహస్తిలో సినిమా ఇండస్ట్రీ అభివృద్ధి చెందేలా ఆశీర్వాదం ఇవ్వాలని ఎస్ సి వి నాయుడు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సినీ డైరెక్టర్, రచయిత, నిర్మాత చిగురుపాటి సుబ్రహ్మణ్యం, హీరో దేవా, సైనిక ఆఫీసర్ పాత్రలో నటించిన స్థానికుడు డాక్టర్ రవిబాబు, మాజీ కౌన్సిలర్ ప్రసాద్ నాయుడు, నరేంద్ర, గోగినేని సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణా కేసులో ఇద్దరికి జైలుశిక్ష

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

శేషాచలం అడవుల నుండి ఎర్రచందనం అక్రమ రవాణా చేస్తూ పట్టుబడిన ఇద్దరికి ఐదేళ్ల జైలు శిక్షతోపాటు ఒక్కొకరికి ఆరు లక్షల చొప్పున జరిమానా విధిస్తూ ఆర్ఎస్ఎస్ ఏడిజె కోర్టు తిరుపతి న్యాయమూర్తి నరసింహమూర్తి తీర్పు ఇచ్చారని టాస్క్ ఫోర్స్ పోలీసులు తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా కేసులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని తగిన సాక్ష్యాధారాలతో పకడ్బందీగా కోర్టు వారికి సమర్పించడంతో సకాలంలో దోషులకు శిక్షలు పడుతున్నాయన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వాటికి ఈ తీర్పు గుణపాఠంగా నిలుస్తుందని టాస్క్ ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ తెలిపారు. తిరుపతి అటవీ రేంజిలోని తిమ్మినాయుడు బీట్ పరిధిలో పూతలపట్టుకు చెందిన పులికంటి శ్రీరాములు, తిరుపతి రూరల్ మండలం తిరుచానూరుకు చెందిన దాస రమణయ్యలపై టాస్క్ ఫోర్స్ పోలీస్ స్టేషన్లో నమోదు చేసిన క్రైమ్ నెంబరు 49/2019 కేసులో న్యాయమూర్తి ఈ శిక్షను విధించారాన్నారు. తీర్పు అనంతరం ఇద్దరిని నెల్లూరు జిల్లా సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

'వెలుగు' సంఘాలను 'ఎ'గ్రేడ్‌కు తీసుకొద్దాం : పీడీ

ప్రజాశక్తి - పిచ్చాటూరు

వెలుగు సంఘాలను ఎ గ్రేడ్‌కు తీసుకొచ్చేలా కృషి చేయాలని డిఆర్‌డిఎ పీడీ టిఎన్ శోభన్‌బాబు పిలుపునిచ్చారు. మంగళవారం పిచ్చాటూరు, నాగలాపురం మహిళా మండల సమాఖ్య కార్యాలయాల్లో వెలుగు అధికారులు, సిబ్బంది, విఓలతో సమీక్షించారు. డ్వాక్రా సంఘాలను మెరుగుపరచి ఎ గ్రేడ్‌సంఘాల జాబితాలోకి తీసుకురావాలని దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వాలు అందించే రుణాల ద్వారా చిన్న చిన్న వ్యాపారాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. అనంతరం మహిళలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టేందుకు, లింగ వివక్షపై నిర్వహించిన ర్యాలీలో పీడీ పాల్గొన్నారు. అంతకుముందు నాగలాపురంలో శ్రీవేదవల్లి సమేత వేదనారాయణస్వామిని పీడీ శోభన్‌బాబు దర్శించుకున్నారు. వెలుగు కార్యాలయానికి సొంత భవనం కావాలని స్థానిక ప్రజాప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. పిచ్చాటూరు, నాగలాపురం ఏపిఎంలు చంద్రకళ, సీతారామయ్య, క్లస్టర్ ఏపిఎం వాసు పాల్గొన్నారు.



శిక్షణా తరగతులను పరిశీలించిన డీఈవో

ప్రజాశక్తి - రామచంద్రాపురం

మండలంలోని సి రామాపురంలో గల వెరిటాస్ సైనిక్ స్కూల్లో తిరుపతి, నెల్లూరు, అన్నమయ్య జిల్లాల మండల విద్యాశాఖ అధికారులు ,పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు జరుగుతున్న ఐదవ బ్యాచ్ శిక్షణ తరగతులను మంగళవారం డిఇఒ కెవిఎన్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ క్రమంలోనే భోజన నాణ్యత, వసతుల కల్పన, శిక్షణలో బోధిస్తున్న అంశాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో ఏఎంవో శివ శంకరయ్య, ఎంఈఓ భాస్కర్, ఏ ఎస్ ఓ సారథి పాల్గొన్నారు.

8న శ్రీశైలంలో ఆధ్యాత్మిక సభ

తిరుపతి టౌన్ : శ్రీశైలం పుణ్యక్షేత్రంలో రాష్ట్రీయ హిందూ వాహిని సంఘటన ఆధ్వర్యంలో ఆధ్యాత్మిక సభను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆర్ హెచ్ వి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు తిరుమల పర్యటనలో భాగంగా తిరుపతిలో ఆయనను ఆర్ హెచ్ వి ఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సుకుమార్ రాజు, మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు శ్రీదేవి రాజు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా కప్పి సత్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ వచ్చే ఏడాది మార్చి నెలలో తిరుపతి నుంచి అయోధ్యకు శ్రీరామ రథయాత్రను వైభవోపేతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. దీనికి అనుబంధంగా జనవరి 8న శ్రీశైలంలో, జనవరి 19న డెహ్రాడూన్ లో ఆధ్యాత్మిక సభలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

దేవుడున్నాడు జాగ్రత్త పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

ఎంతో ప్రాచుర్యం కలిగిన తిరుమల శ్రీవారి వాస్తవిక చరిత్రను నేడున్న సమాజానికి తెలపాల్సిన ఆవశ్యకత టీటీడీపై ఉందని సీనియర్ జర్నలిస్టు, రచయిత ఎం.వెంకటరమణ శాస్త్రి అభిప్రాయపడ్డారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఆయన రచించిన " దేవుడున్నాడు జాగ్రత్త " పుస్తకాన్ని జనసేన పార్టీ కార్యదర్శి బి.సత్యనారాయణతో కలిసి ఆవిష్కరించారు. 44 సంవత్సరాల మీడియా అనుభవంతో టీటీడీకి సంబంధించిన వాస్తవికతను వక్రీకరిస్తూ చేపడుతున్న కార్యక్రమాలు, గత 75 సంవత్సరాలుగా జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలు బాహ్య ప్రపంచంలోకి వెలుగు చూడడం లేదన్నారు. తిరుమలకు సంబంధించిన చరిత్రను, కొనసాగించిన అన్యాయాలు అక్రమాలను రికార్డుల ఆధారాలతో దేవుడున్నాడు జాగ్రత్త పుస్తకంలో పొందుపరచడం జరిగిందన్నారు.



టిటిడి ఛైర్మన్, ఈవోలతో శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు

క్రీడాభివృద్ధికి టీటీడీ సహకరించాలి : శాప్

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

తిరుపతి వేదికగా క్రీడారంగాన్ని అభివృద్ధి చేసేందుకు టీటీడీ సహకారం అవసరమని ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ అనిమిని రవినాయుడు ఆకాంక్షించారు. తిరుమల తిరుపతి దేవస్థానాల ఛైర్మన్ బీఆర్ నాయుడుని, దేవస్థానం ఈఓ జె.శ్యామలారావుని టీటీడీ ఛైర్మన్ కార్యాలయంలో శాప్ ఛైర్మన్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా క్రీడారంగాభివృద్ధికి సంబంధించిన సమస్యలపై వారిరువురికీ రవినాయుడు విన్నవించారు. హాకీ క్రీడకు విశేషాదరణ లభిస్తుందని, తిరుపతిలోని ఎస్వీ ఆర్ట్స్ కాలేజీలోనున్న హాకీ అకాడమీని పున్ణప్రారంభించాలని కోరారు. అలాగే శ్రీశ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్సులో మౌలిక వసతుల కల్పన, మరమ్మతుల నిర్వహణకు టీటీడీ సహకరించాలని కాంక్షించారు. క్రీడారంగానికి టీటీడీ సహకరిస్తే తిరుపతి నుంచి అంతర్జాతీయస్థాయి క్రీడాకారులను తయారుచేసే అవకాశం ఉంటుందని వివరించారు.

సాధు సుబ్రహ్మణ్యశాస్త్రికి ఘనంగా పుష్పాంజలి

ప్రజాశక్తి - క్యాంపస్

టిటిడిలో పేష్కారుగా, ఎపిగ్రాఫిస్టుగా విశేష సేవలందించిన సాధు సుబ్రహ్మణ్యశాస్త్రి 136వ జయంతి సందర్భంగా తిరుపతిలోని శ్వేత భవనం ఎదురుగా ఉన్న ఆయన విగ్రహానికి మంగళవారం డిపిపి ప్రాజెక్టు అధికారి రాజగోపాల్ పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా శాస్త్రి మనవడు, జిల్లా జడ్జి శ్రీమూర్తి మాట్లాడుతూ తిరుమలకు సంబంధించి అనేక చారిత్రిక, సాంస్కృతిక, ఇతిహాసిక శాసనాలను వెలుగులోకి తీసుకొచ్చిన ఘనత శాస్త్రికి దక్కుతుందన్నారు. వారి జీవనం అందరికీ ఆదర్శనీయమని చెప్పారు. కుమార్తె సాధు గిరిజ మాట్లాడుతూ శాస్త్రి శ్రీ వేంకటేశ్వర స్వామివారిపై భక్తితో అనేక శాసనాలను పరిశీలించి, పరిశోధించి అందరికీ అందుబాటులోకి తెచ్చారని చెప్పారు. శాస్త్రి సహోద్యోగి కష్ణారెడ్డి మాట్లాడుతూ వారితో ఉన్న అనుబంధాన్ని పంచుకున్నారు.

ఎస్వీయూలో ఘనంగా షర్మిల జన్మదిన వేడుకలు

క్యాంపస్‌లో... ఎస్వీయూ ప్రధాన ముఖద్వారం వద్ద కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి జన్మదిన వేడుకలు మంగళవారం ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జెన్నే మల్లికార్జున ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మల్లికార్జున, తిరుపతి అధ్యక్షులు షేక్ జావీద్ మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రభుత్వాలను ప్రశ్నించే గొంతుక ,బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి వైయస్ షర్మిలమ్మ జన్మదిన జరుపుకోవడం చాలా ఆనందంగా ఉందన్నారు. 2029లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కాబోయే ముఖ్యమంత్రి షర్మిలమ్మ ఖాయం అన్నారు.

గంగాప్రసాద్ ను కలిసిన టీడీపీ నేతలు

ప్రజాశక్తి -కే వి బి పురం

కె.వి.బి పురం మండల సీనియర్ టీడీపీ నేతలు, రాష్ట్ర బి.సి సెల్ ప్రధాన కార్యదర్శి మునస్వామి యాదవ్, సర్పంచ్ దొరబాబు నాయుడు, గోపి యాదవ్‌లు సీనియర్ నాయకులు ప్రముఖ పారిశ్రామికవేత్త కొండేపాటి గంగాప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు ఇటీవల జరిగిన సాగునీటి సంఘం ఎన్నికల గురించి చర్చించారు అనంతరం నియోజకవర్గంలో జరుగుతున్న విషయాలను గంగాప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. నీటి సంఘం ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన టీడీపీ అభ్యర్థులు గెలవడంలో కీలక పాత్ర పోషించిన మునస్వామి యాదవ్, దొరబాబు నాయుడు, గోపి యాదవ్‌లను గంగాప్రసాద్ అభినందించారు.

పింక్ బస్సు సేవలను సద్వినియోగం చేసుకోండి

బిఎన్ కండ్రిగ : తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ(స్విమ్స్) ఆధ్వర్యంలో రెండు పింక్ బస్సుల ద్వారా ఉచితంగా అందిస్తున్న వైద్యసేవలను నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం కోరారు. స్విమ్స్, శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ ఆధ్వర్యంలో మంగళవారం బిఎన్ కండ్రిగ పిహెచ్ సి పరిధిలోని కాటూరు గ్రామం, విఎస్.పురం విలేజ్ హెల్త్ సెంటర్ లో ఉచితంగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. బిఎన్ కండ్రిగ పిహెచ్ సి పరిధిలో డిసెంబర్ 19న పల్లమాల, పార్లపల్లి, డిసెంబర్ 20న తలారివెట్టు, వెస్ట్ వరత్తూరు, డిసెంబర్ 23న ఆర్.అనంతపురంలో ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు జరగనున్నాయి. ఈ కార్యక్రమంలో బిఎన్ కండ్రిగ పిహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ దివాకర్, డాక్టర్ విద్యాసాగర్, స్విమ్స్ శ్రీ బాలాజీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అంకాలజీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ పద్మావతి, డాక్టర్ హరిత, సిహెచ్ఓ డిఎస్.వెంకటేశుపాల్గొన్నారు.

ఈఎస్ఐలో మొరాయించిన సర్వర్

ఓపీల కోసం రోగుల పడిగాపులు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రభుత్వాలకు, అధికారులకు కార్మికులు అంటేనే అలుసులా ఉంది. ఆరుగాలం కాయకష్టం చేసి, చాలీచాలని వేతనాలతో బతుకు జీవనం సాగించే కార్మికులకు తీరా అనారోగ్యం పాలైనా ఇఎస్ఐ ఆస్పత్రిలోనూ తిప్పలు తప్పడం లేదు. మంగళవారం ఇఎస్ఐ ఆస్పత్రిలో సర్వర్ మొరాయించడంతో గంటలు గంటలు ఓపీల కోసం రోగులు పడిగాపులు పడాల్సి వచ్చింది.

కార్మికులకు వైద్య సేవలు అందించేందుకు ఏర్పాటు చేసిన తిరుపతి ఈఎస్ఐ ఆసుపత్రిలో అరకొర వసతులు, సిబ్బంది ఛీత్కారాలు తప్పడం లేదు. తిరుపతి ఆర్సి రోడ్డులో ఉన్న ఈఎస్ఐ కార్పొరేట్ ఆసుపత్రికి ప్రతిరోజూ వైద్యం నిమిత్తం వందలాది మంది రోగులు వస్తుంటారు. కార్మికుల వేతనాలు నుంచి ప్రతినెల కట్ చేసే ఈఎస్ఐ నగదు నుంచే వైద్యం అందిస్తుంటారు. కానీ



అక్కడ వైద్యులుగాని, సిబ్బంది గాని కార్మికులకు ఉచితంగా వైద్యం ఇస్తున్నట్టు కార్మికుల్ని చూస్తుంటారు. రెండు రోజులుగా ఈఎస్ఐ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఓపి కార్డులు ఇచ్చే సర్వర్ మొరాయించింది. దాన్ని సరి చేయడంలో అక్కడ అధికారులు కానీ సిబ్బంది గాని పట్టించుకోకపోవడం శోచనీయం. ప్రత్యామ్నాయంగా ఓపి కార్డులు మ్యాన్యువల్ గా ఇవ్వాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు శూన్యం. దీంతో రకరకాల వ్యాధులకు చికిత్స కోసం ఆసుపత్రికి వచ్చిన కార్మికులు, కార్మికుల కుటుంబ సభ్యులు కేవలం ఓపి కార్డు కోసమే గంటల తరబడి వేచి ఉండక తప్పడం లేదు. వీరి సమస్యలను వినే నాథుడే కరయ్యాడు. డ్యూటీలో ఉంటూ పర్మిషన్ పై వైద్యం కోసం వచ్చిన కార్మికులు గంటలు తరబడి వేచి ఉండలేక, ఉసూర్మంటు వెనుదిరిగారు. కొంతమంది హాఫ్‌డే సెలవు పెట్టుకోవాల్సి వచ్చింది. ఇక ఆరోగ్య సమస్య తీవ్రంగా ఉన్నవారు పరిస్థితి మరీ దారుణం. కార్మికుల శ్రమ ద్వారా వచ్చే డబ్బు ద్వారా వేతనాలు తీసుకుంటున్న సిబ్బంది, అధికారులు వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించడంలో నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం బాధాకరం. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, సర్వర్‌కు మరమ్మత్తులు చేసి, ఓపీకి ఇబ్బంది లేకుండా చూడాల్సి ఉంది.

ఆటోనగర్‌లో భూ కబ్జాపై చర్యలు తీసుకోండి

తిరుపతి సిటీ : ఆటో నగర్‌లో మంగళవారం ఉదయం రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ఇంటి స్థలాల కోసం 62 వినతిపత్రాలు రాగా 76 అర్జీలు వివిధ రకాల రెవెన్యూ సమస్యలపై వచ్చాయి. ఉదయం నుంచి సాయంత్రం వరకు రెవెన్యూ అధికారులు తహశీల్దారు బాగ్యలక్ష్మి ఆధ్వర్యంలో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఆటోనగర్ లో సత్యసాయి ట్రస్టు కి ఇచ్చిన స్థలాన్ని వైసిపి కార్పొరేటర్ భర్త అజయ్ కుమార్, నాగేశ్వర రావు లు ఆక్రమించారని ఎన్డీఏ నాయకులు చల్లా, బాబ్జీ, పెంచలయ్యలు ఎమ్మెల్యే దష్టికి తీసుకువచ్చారు. ఎంఎల్ఏ స్పందిస్తూ సత్యసాయి ట్రస్టు భూమి ఆక్రమణపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో టిటిడి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్, క్లస్టర్ ఇంచార్జీ కష్ణ యాదవ్ పాల్గొన్నారు.

స్మశానానికి స్థలం కేటాయించండి

ప్రజాశక్తి-యర్రావారిపాలెం

వారం రోజులుగా జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో భాగంగా మంగళవారం బోడేవాండ్లపల్లి, నెరబైలు గ్రామపంచాయతీల యందు రెవెన్యూ సదస్సులు నిర్వహించినట్లు తహశీల్దార్ పరమేశ్వర స్వామి తెలిపారు. మండలంలో దళిత గ్రామాలకు స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయించాలని మండల దళిత డప్పు కళాకారుల సంఘం నాయకులు తహశీల్దార్‌కు అర్జీ ఇచ్చారు. స్థల పరిశీలన చేసి స్మశాన వాటికకు స్థలాన్ని కేటాయిస్తామని తాసిల్దార్ హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు.రైతు సదస్సులలో రైతుల నుండి



వచ్చిన భూ సమస్యలపై ఫిర్యాదులను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

భూ సమస్యలను వెంటనే పరిష్కరించండి : ఆదిమూలం

బిఎన్ కండ్రిగలో... కాటూరు పంచాయతీలో రెవెన్యూ సదస్సు జరిగింది. ఎంఎల్ఏ కోనేటి ఆదిమూలం పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రేషన్‌కార్డు దగ్గర నుంచి పింఛన్, భూ సమస్యలు, పట్టాదారు పాసు పుస్తకాలు తదితర ఏ సమస్య అయినా కలెక్టరేట్ చుట్టూ తిరగకుండా పరిష్కరించుకునేందుకే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెవెన్యూ సదస్సులను ఏర్పాటు చేశారన్నారు. తహశీల్దార్ సుబ్రమణ్యం, డిప్యూటీ తహశీల్దార్ చంద్రబాబునాయుడు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మించల నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ పెంచలయ్యను పరామర్శించిన ఆదిమూలం

ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ

మండలంలోని కనుమన్నంవేడు పంచాయతీ మాజీ సర్పంచ్ పెంచలయ్యను మంగళవారం ఉదయం సత్యవేడు నియోజకవర్గం శాసనసభ్యులు కోనేటి ఆదిమూలం పరామర్శించారు. గత కొంతకాలంగా పెంచలయ్య పక్షవాతం అనారోగ్యానికి గురి కావడంతో పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం కాటూరులో జరిగినటువంటి రెవెన్యూ సదస్సులో పాల్గొని అక్కడినుండి పెంచలయ్య గహానికి వెళ్లి పరామర్శించారు. కుటుంబానికి ధైర్యం చెప్పారు.

మండలంలో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన

వరదయ్యపాలెంలో... ఎంఎల్ఏ ఆదిమూలం సుడిగాలి పర్యటన చేశారు. గోవర్ధనపురం హైస్కూల్లో నూతన తరగతి గదిని ప్రారంభించారు. రాష్ట్రస్థాయి టెన్నిస్‌పోటీల్లో సత్తా చాటిన జడ్‌పి హైస్కూలు విద్యార్థులు ఒ.మోహన్‌కృష్ణ, ఆకాష్‌లను సన్మానించి అభినందించారు. ఎంఇఒ సరస్వతి, ఎంపిడిఒ ప్రసాద్, డిప్యూటీ తహశీల్దార్ వెంకట సుబ్బయ్య పాల్గొన్నారు.

కోటలో... మంగళవారం కొత్తపాలెం గ్రామంలో టిడిపి నాయకులు నెల్లూరు మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.తహశీల్దార్ జెజెరావు, డిప్యూటీ తహశీల్దార్ పఠాన్ అజంతుల్లాఖాన్, ఆర్ఐ మధులత విచ్చేశారు.

రామచంద్రాపురంలో... నెన్నూరు రెవెన్యూ గ్రామంలో 82 వినతులు అందాయి. తహశీల్దార్‌కె.వెంకటరమణ, డిప్యూటీ తహశీల్దార్ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

విశ్వవిద్యాలయాల్లో అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలి

ప్రజాశక్తి - క్యాంపస్

విశ్వవిద్యాలయాలలో అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేయాలని ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి అన్నారు. ఏబీఆర్ఎస్ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఉన్న డాక్టర్ గంగినేని రంగనాథ్ కర్ణాటక సెంట్రల్ యూనివర్సిటీలో కామర్స్ విభాగములో అసోసియేట్ ప్రొఫెసర్‌గా నియామకం అయిన సందర్భముగా డాక్టర్ రంగనాథ్‌ను ఏబిఆర్ఎస్ఎం తిరుపతి శాఖ తరపున శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో సన్మానించి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ వైవి రామిరెడ్డి మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా దేశంలోని కేంద్రీయ విశ్వవిద్యాలయాలలో దాదాపు 70 శాతం అధ్యాపకుల ఖాళీలను భర్తీ చేశారని, ఇంకను 30శాతం ఖాళీలు భర్తీ చేయవలసి ఉందన్నారు. అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 17 రాష్ట్ర విశ్వవిద్యాలయాలలో దాదాపు 75శాతం అధ్యాపకుల ఖాళీలు ఉన్నాయన్నారు.అన్ని విశ్వ విద్యాలయాలకు శాశ్వత ఉపకులపతులను నియమించి, అధ్యాపక నియామక ప్రక్రియకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ప్రొఫెసర్ ఎం రాజశేఖర్, ప్రొఫెసర్ జయచంద్ర రెడ్డి, టెక్నికల్ ఎడ్యుకేషన్ రాష్ట్ర కార్యదర్శి ఎన్ బాలసుబ్రమణ్యం, రంజని, వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

ఘనంగా ఇంధన పొదుపు వారోత్సవాల సదస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ


'కరెంటు ఆదా చేద్దాం... భావితరాలకు భరోసానిద్దాం' అంటూ జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలలో భాగంగా మంగళవారం 33/11కె.వి. గురువరాజ పల్లి రేణిగుంట, తిరుపతి రూరల్ సబ్ స్టేషన్‌లలో ప్రత్యేక సదస్సు నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా తిరుపతి టౌన్ డివిజన్ విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ విన్న కోటి చంద్ర శేఖర్ రావ్ పాల్గొన్నారు. ఇందన్ పొదుపు ఆవశ్యకత, విద్యుత్ ప్రమాదాలు నివారించు చర్యలు చేపట్టావాల్సిన జాగ్రత్తలు, గహాలలో పి.ఎమ్. సూర్య రుఫ్ టాప్ సోలార్ ప్రాజెక్టుపై అవగాహన గురించి వినియోగదారులకు వివరించారు. ఈ ఇంధన పొదుపు వారోత్సవాలలో ఏడిలు రమేష్ మునిప్రసాద్, ఏ.ఈ లు మోహన్, మహబూబ్ బాషా, పుణ్యకోటి, హరి ప్రసాద్ పాల్గొన్నారు.

త్రీస్టార్ గృహోపకరణాలే వాడాలి

బిఎన్ కండ్రిగలో.. విద్యుత్ బిల్లులు తక్కువగా రావాలంటే ప్రతి ఒక్కరూ త్రీ స్టార్, అంతకంటే ఎక్కువ ఉండే గృహోపకరణాలే వాడాలని అసిస్టెంట్ ఇంజినీర్ చలపతి అన్నారు. మంగళవారం విద్యుత్ కార్యాలయంలో జాతీయ విద్యుత్ పొదుపు వారోత్సవాలు జరిగాయి. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.

బోర్డు తొలగించిన వారిపై చర్యలు తీసుకుంటాం: ఎఫ్ఆర్వో

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



తిరుమల పాపవినాశనం స్థల విశిష్టతను తెలుపుతూ ఏర్పాటు చేసిన బోర్డును ఇటీవల కొందరు తొలగించారని తమ దష్టికి వచ్చిందని, దీనిపై విచారణ కమిటీని వేసి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్వీఎన్పి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుదర్శన్ రెడ్డి తెలిపారు. మంగళవారం ఎఫ్ఆర్వోను కలిసిన 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడారు. అటవీ శాఖ నిధులతో పాపవినాశనంలో డార్మటరీ హాలు, పబ్లిక్ టాయిలెట్స్ ను నిర్మించాలని నిర్ణయించామన్నారు. ఈ మేరకు అవసరమైన యంత్రాలను అటవీ శాఖ నుండి గుత్తేదారుకు అప్పగించడం జరిగిందన్నారు. బోర్డు కటింగ్ చేయడానికి గుత్తేదారుకు అప్పగించిన జనరేటర్ వినియోగించారని గుర్తించామన్నారు. విచారణ పూర్తయిన తర్వాత బాధ్యులపై సాధారణ చర్యలతో పాటు, వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ ప్రకారం చర్యలు ఉంటాయన్నారు. ఇటువంటి ఘటనలు పునరావతం కాకుండా పాపవినాశనంలో నిరంతర నిఘా కోసం ప్రత్యేక పెట్రోలింగ్ బందాన్ని ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలానే పాపవినాశనం వెళ్లే యాత్రికులకు టోల్ గేట్ వసూళ్లలో కొత్త విధానం తీసుకొచ్చామన్నారు. మొబైల్ బేస్డ్ టికెట్ ఇచ్చే విధానాన్ని ప్రవేశ పెట్టామన్నారు. దీని ద్వారా ఎన్ని వాహనాలు వెళ్లాయి, టికెట్ల ద్వారా ఎంత నగదు అటవీ శాఖ ఖాతాకు చేరుతున్నది అధికారులు పరిశీలించుకొనేలా మానిటరింగ్ చేసుకునే అవకాశం ఉందన్నారు.

సమగ్ర యాజమాన్య పద్ధతుల్లోనే అధిక దిగుబడులు

ప్రజాశక్తి-యర్రావారిపాలెం, రామచంద్రాపురం

సమగ్ర యాజమాన్య పద్ధతుల్లోనే అధిక దిగుబడులు సాధ్యమని జిల్లా వ్యవసాయ అధికారి వేణుగోపాలరావు తెలిపారు. జిల్లా వనరుల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం రైతులకు శిక్షణ ఇచ్చారు. రానున్న సీజన్లో మామిడి పంటలో పాటించవలసిన సస్యరక్షణ చర్యలు గురించి వ్యవసాయ అధికారి కె.వి శ్రీనివాసులు సూచించారు. రైతులకు పంట బీమా ప్రయోజనాల గురించి మండల వ్యవసాయ అధికారి ఖాదర్ బాషా వివరించారు.ఈ కార్యక్రమంలో రైతు సేవ సిబ్బంది మునిశేఖర్, భాను ప్రకాష్, రాజశేఖర్, తేజస్విని, జాహ్నవి, నళిని పాల్గొన్నారు.



రామచంద్రాపురంలో జిల్లావ్యావసాయ శాఖ డిప్యూటీ డైరెక్టర్ ఎ.భాస్కరయ్య ఆధ్వర్యంలో గండిరెడ్డిపల్లి రైతు సేవా కేంద్రంలో పండ్ల తోటల్లో సాగు, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు శిక్షణ ఇచ్చారు.

ఆ సర్వేయర్ ఎంత చెబితే అంత...!

కసిమిట్ట, బొబ్బరాజుపాలెం రైతుల వ్యథ

ప్రజాశక్తి - నారాయణవనం

జగనన్న భూరక్ష పథకంలో నారాయణవనం మండలం కసింమిట్ట, బొబ్బరాజుపాలెం లెక్కదాఖలాలోని భూములు ఇష్టానుసారంగా మారిపోయాయని రైతులు వాపోతున్నారు. జగనన్న ప్రభుత్వంలోని అప్పటి సర్వేయర్, విఆర్ఒలు చేతివాటంతో తప్పుడు సర్వేలు చేసి, తమకు అనుకూలంగా ఉన రైతులకు సర్వేలో పక్కనున్న రైతుల మూడు సెంట్లు, రెండు సెంట్లు, ఒక సెంటు భూమిని కలిపేశారన్న విమర్శలున్నాయి. రీసర్వే చేసి తమకు న్యాయం చేయాలని బాధిత రైతులు కోరుతున్నారు. ముడుపుల పేరుతో సర్వేయర్ల చేతులు తడిపిన రైతులకు అనుకూలంగా జగనన్న భూరక్ష పథకం కింద రీసర్వే వరంగా మారింది. పేదవాని భూమిని భూస్వాములకు అనుకూలంగా మార్చేశారని, సర్వేయర్లు ఆడింది ఆటగా పాడింది పాటగా పేదవాని భూమిని పందేరం చేశారని బాధితులు వాపోతున్నారు. భూస్వాములపై పేద రైతులు తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి ఫిర్యాదు చేస్తే ఆగమేఘాలపై ఫిర్యాదు చేసిన సమాచారాన్ని తమకు అనుకూలమైన భూస్వాములకు చేరవేసి స్వామిభక్తి చాటుకుంటున్నారన్నది వారి ఆవేదన. ప్రస్తుతం జరుగుతున్న రెవెన్యూ సదస్సుల్లో పేదల ఫిర్యాదులకు న్యాయం చేస్తారా? లేక భూస్వాములకే వత్తాసు పలుకుతారా? అన్నది వేచి చూడాల్సిందే. రీసర్వే చేసి బాధిత రైతులకు న్యాయం చేసి, అప్పటి సర్వేయర్లపై చర్యలు తీసుకోవాలని బాధితులు వాపోతున్నారు.

క్రైం న్యూస్



మిస్సింగ్ కాదు మర్డర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

గత నెల 25వ తేదీన శ్రీకాళహస్తి వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో నమోదైన మిస్సింగ్ కేసును మర్డర్ గా గుర్తించారు పోలీసులు. ఆ వివరాలను మంగళవారం వన్ టౌన్ సిఐ గోపి వెల్లడించారు. పట్టణానికి చెందిన ప్రభాకర్ అనే వ్యక్తి కనబడుటలేదని అతని భార్య సుధా స్థానిక వన్ టౌన్ పోలీస్ స్టేషన్ లో నవంబర్ 25న ఫిర్యాదు చేసింది. ఆ మేరకు దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు ప్రభాకర్ ది మిస్సింగ్ కేసు కాదనీ, హత్యగా గుర్తించారు. ఏర్పేడు మండలం గొల్లపల్లి గ్రామానికి చెందిన వెంకటేష్ భార్యతో ప్రభాకర్ వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నట్లు తెలుసుకొని పథకం ప్రకారం హత్య చేయించినట్లు సీఐ తెలిపారు. వెంకటేష్ తో పాటు అతని బావ సుబ్రహ్మణ్యం, అల్లుడు హేమంత్ లు కలిసి ప్రభాకర్ ను అంతమొందించి గొల్లపల్లి గ్రామ సమీపంలోని నీటి కుంటలో పూడ్చి పెట్టారని తెలిపారు. నిందితులు ఇచ్చిన సమాచారం మేరకు ప్రభాకర్ మతదేహాన్ని స్వాధీనం చేసుకొని ఏర్పేడు మండల తహశీల్దారు సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించారు.

బుల్డోజర్‌ను ఢీకొన్న ఆర్టీసీ బస్సు

ప్రజాశక్తి -తిరుపతి సిటి

ఆగి ఉన్న బుల్డెజర్ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ఘటనలో సుమారు 30 మంది ప్రయాణికులకు గాయాలైన ఘటన మంగళవారం తిరుపతిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు నాయుడుపేట- పుత్తలపట్టు రహదారిలోని తిరుపతి రూరల్ గొల్లపల్లి సమీపంలో తిరుపతి నుంచి చిత్తూరుకు వెళుతున్న చిత్తూరు టు డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు రోడ్డుపై నిలిపి ఉంచిన బుల్డెజర్ను ప్రమాదవశాత్తు ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. అందులో ప్రయాణిస్తున్న సుమారు 30 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ప్రయాణికుల ఆర్తనాదాలతో ఆ ప్రాంతం అంత దద్దరిల్లింది. స్థానికులు హటా హుటిన అక్కడికి చేరుకొని బస్సులో నుంచి క్షతగాత్రులను వెలుపులకి తీశారు. సమాచారం అందుకున్న తిరుపతి రూరల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, గాయాలు పాలైన ప్రయాణికులను 108 ద్వారా తిరుపతి రుయా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్నకలెక్టర్ వెంకటేశ్వర్లు, రవాణా శాఖ మంత్రి రాంప్రసాద్ రెడ్డి స్పందించి, ప్రయాణికులకు మెరుగైన వైద్యం అందించాలని రుయా అధికారులను ఆదేశించారు.

జువాలజీలో శ్రీదేవికి డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్



శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం జువాలజీ పరిశోధక విద్యార్థి చల్ల శ్రీదేవికి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి మూడే దామ్లా నాయక్ ఓ ప్రకటనలో తెలిపారు. ఎస్వీయూ జువాలజీ విభాగ విశ్రాంతాచార్యులు ఎ.ఉషారాణి పర్యవేక్షణలో ఆర్సెనిక్, కాడ్మియం ప్రభావం వల్ల మగ ఆల్బినో ఎలుకల కాలేయం, మూత్రపిండాలకు సంబంధించి కణజాల వ్యాధులు, జీవ రసాయన మార్పులు అనే అంశంపై ఆమె సిద్ధాంత గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించారు. శ్రీదేవి ఇప్పటివరకు పలు జాతీయ, అంతర్జాతీయ సదస్సులో పరిశోధనా పత్రాలు సమర్పించి వివిధ సదస్సులలో పాల్గొన్నారు. ఈమె రూపొందించిన పరిశోధన వ్యాసాలు ప్రముఖ జర్నల్స్లో ప్రచురితమయ్యాయి.

IN THE COURT OF THE 2nd Addl. CIVIL JUDGE (JUNIOR DIVISION), TIRUPATI
O.S.No. 369/2023, I.A.No.172/2023

K.Divya Teja ...Plaintiff/Petitioner
V/s
D1) P.Bhaskar Reddy S/o P.Gopal Reddy, Retired wing Commander, Indian Air-Force, R/o D.No.18-8-39/F, Madhura Nagar, Tirupati Town
D2) K.Parameswari W/o K.Subramanyam Naidu, D.No.18-8-39/F, Madhura Nagar, Tirupati Town ...Defendants/Respondents

SUIT SUMMON TO THE D1 & D2

పై దావాలోని వాది, ప్రతివాదులపై దావా షెడ్యూలు దాఖలా భూమికిగాను పర్మనెంట్ ఇంజంక్షన్ కొరకు వేసియున్నారు. సదరు దావాలో టెంపరరీ ఇంజంక్షన్ కొరకు ఐ.ఎ.నెం.172/2023 మనువు వేసి సదరు మనువులో టెంపరరీ ఇంజంక్షన్ ఉత్వర్వులు పొంది యున్నారు. పై తెల్పిన దావా నందు మరియు సదరు మనువులో మీ హాజరు నిమిత్తం తేది. 30.12.2024 వాయిదా వేసియున్నారు. సదరు తేదీన ఉదయం 10.30 గంIIలకు నేరులోగాని లేక వకీలు ద్వారా హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షముగా తీర్మాణించబడును.

తెల్లజాల వేణుగోపాల్
అడ్వకేట్, తిరుపతి. సెల్: 9849394446

IN THE COURT OF THE II ADDITIONAL CIVIL JUDGE (JUNIOR DIVISION) TIRUPATI
O.S.No. 787/2023

State Bank of India, Municipal Office Road Branch, Tirupati ...Plaintiff
V/s
Stephen Kumar Lingam ...Defendant

SUIT SUMMON TO DEFENDANT

Stephen Kumar Lingam S/o Lingam Purushotham, Shramic, Staff No.577302, APSRTC, Alipiri Depot, Tirupati and resident of D.No.14-215, Gowri Nagar, Renigunta Village, post and Mandal, Tirupati District, Aadhaar No.4395 4215 2416, Cell No.8143249962 and 8639869104

Please take suit summons that in the above suit filed by the plaintiff against you is posted to 21-01-2025 for your appearance before the above court. If you got any objections, attend the above court on the above date at 10-30 a.m. and file the same. Failing which the matter will be decided exparte.

HEARING DATE: 21-01-2025

D.JAYACHANDRA
Advocate, Tirupati

మహారాజశ్రీ శ్రీకాళహస్తి ప్రిన్సిపల్‌జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాళహస్తి
O.S No.105/2022

Between:
బి.మనోహర రెడ్డి వగైరా ...వాదులు
And:
బి.వరలక్ష్మమ్మ 17 వగైరాలు ...ప్రతివాదులు
To
R17: యస్.మోహన్‌రావు, తండ్రి భక్తవత్సల నాయుడు, వికృతమాల గ్రామం, పాపానాయుడు పేట పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.
R18: యస్.రాజశ్రీ, కేరాఫ్ భక్తవత్సల నాయుడు, వికృతమాలగ్రామం, పాపానాయుడుపేట పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.

సమన్లు

ఇందుమూలంగా O.S.No. 105/2022 లో 17 మరియు18 ప్రతివాదులు అయిన మీకు తెలియజేయడం ఏమనగా పై కేసు నందు మీ హాజరు కోరుతూ 20.12.2024న వాయిదా కలదు. కావున మీరుగానీ మీ అనుమతి పొందిన ప్లీడరు గానీ 20.12.2024న ఉదయం 10:30 గంIIలకు హాజరై ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షమున మీ పరోక్షమున కేసు తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు
సి.వెంకటస్వామి
పిటిషనర్స్ తరపున న్యాయవాది
శ్రీకాళహస్తి.

మహారాజశ్రీ శ్రీకాళహస్తి ప్రిన్సిపల్‌జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాళహస్తి
I.A.No.255/2022
O.S No.105/2022

Between:
బి.మనోహర రెడ్డి వగైరా ...పిటిషనర్స్
And:
బి.వరలక్ష్మమ్మ 17 వగైరాలు ...రెస్పాండెంట్స్
To
R17: యస్.మోహన్‌రావు, తండ్రి భక్తవత్సల నాయుడు, వికృతమాల గ్రామం, పాపానాయుడు పేట పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.
R18: యస్.రాజశ్రీ, కేరాఫ్ భక్తవత్సల నాయుడు, వికృతమాలగ్రామం, పాపానాయుడుపేట పోస్టు, ఏర్పేడు మండలం, తిరుపతి జిల్లా.

నోటీసు

ఇందుమూలంగా IANo. 255/2022 లో 17 మరియు18రెస్పాండెంట్స్ అయిన మీకు తెలియజేయడం ఏమనగా పై పిటిషను నందు మీ హాజరు కోరుతూ 20.12.2024న వాయిదా కలదు. కావున మీరుగానీ మీ అనుమతి పొందిన ప్లీడరు గానీ 20.12.2024న ఉదయం 10:30 గంIIలకు హాజరై ఏదైనా ఆక్షేపణలు ఉన్న యెడల తెలుపుకొనవచ్చును. అట్లు హాజరు కాని పక్షమున మీ పరోక్షమున పిటిషన్ తీర్మానించబడునని తెలియజేయడమైనది.

ఇట్లు
సి.వెంకటస్వామి
పిటిషనర్స్ తరపున న్యాయవాది
శ్రీకాళహస్తి.



జాతీయస్థాయి జంప్ రోప్ పోటీలకు బిసిఎం విద్యార్థులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)

మంగళం పరిధిలోని బాలచంద్ర మెమోరియల్ హైస్కూల్ (బిసిఎం) విద్యార్థులు జంప్ రోప్ ఆటల పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ ప్రియా తెలిపారు. ఈ నెల 14, 15 న సత్యసాయి జిల్లాలో నిర్వహించిన 5వ సబ్ జూనియర్ రాష్ట్ర ఛాంపియన్షిప్ పోటీల్లో బిసిఎం విద్యార్థులు 5 బంగారు పతకాలు, 4 వెండి పతకాలు, 5 కాంస్య పతకాలు సాధించారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుకన్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ప్రమీన పాల్గొన్నారు.

ఘనంగా మినీ క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి -తిరుపతి సిటీ

ప్రవీణ్ ఇనిస్టిట్యూట్ పారామెడికల్ సైన్సెస్ గ్రూప్ సంస్థల మినీ క్రిస్మస్ వేడుకలు శ్రీతెలుగు నగర్ లోని కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ ఎమ్మెల్యే డాక్టర్ అరుణ, గౌరవ అతిథులుగా విజువలి చాలెంజ్ అన్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు పి చిట్టిబాబు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థల చైర్మన్ ఎలమంచిలి ప్రవీణ్, జెస్సీ గ్రేస్, ఏ గీత పాల్గొన్నారు.



దెబ్బతిన్న రోడ్డు పరిశీలన

వర్షానికి దెబ్బతిన్న రోడ్లు పరిశీలన

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

ఇటీవల కురిసిన వర్షాలకు దెబ్బతిన్న వడమాలపేట మండలం రైల్వే ఓవర్ బ్రిడ్జి సమీపంలోని చీమలవారి వంక కాజ్వేను నగరి నియోజకవర్గ ఎంఎల్ఎ గాలి భానుప్రకాష్, కలెక్టర్ వెంకటేశ్వర్లు కలిసి మంగళవారం పరీక్షించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం లేకుండా రోడ్డు మరమ్మతు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు జానా వెంకటయ్య, ధనంజయ నాయుడు పాల్గొన్నారు. పుత్తూరు రూరల్ తడుకు పంచాయతి ఎగువ గూళూరు గ్రామంలో ఉపాధి హామీ, పంచాయతీ నిధులు రూ.13.40 లక్షలతో సిసి రోడ్డు నిర్మాణానికి సర్పంచి బొబ్బిలి వెంకటేష్ యాదవ్‌చేతుల మీదుగా భూమిపూజ చేశారు.

నీటి సంఘాల చైర్మన్ నరసింహారెడ్డికి సన్మానం

ప్రజాశక్తి -రామచంద్రపురం

మండలంలోని బలిజపల్లి వద్ద ఉన్న గుండాల వంక చెరువు సాగునీటి సంఘాల చైర్మన్ బాధూరు నరసింహారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ సుంకర కష్ణయ్యలను ఎమ్మెల్యే పులివర్తి నాని ఘనంగా సన్మానించారు. మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నానిని రఘునాథ రిసార్ట్స్ లోని చంద్రగిరి నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో చైర్మన్ బాదూరు నరసింహారెడ్డి, వైస్ చైర్మన్ సుంకర కృష్ణయ్యలు ప్రత్యేకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. గుండాల చెరువు ఆయకట్టు రైతులకు పంటలు పండించుకునేందుకు సకాలంలో సాగునీరు అందించేలా కృషి చేస్తామన్నారు.

ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం అందించండి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



ఎయిడ్స్ పేషంట్లకు అందుతున్న సేవలపై పరిశీలన

ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ మంజుల ఐసిటీసీ సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆమె స్థానిక శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిని ఆకస్మిక తనిఖీ చేశారు. ఎయిడ్స్ బాధితులు, హెచ్ఐవి నియంత్రణ కోసం నిర్వహిస్తున్న ఐసిటీసీ, పీపీటీసీ, ఏఆర్టీ ప్లస్, కేంద్రాలను పరిశీలించారు. ఎయిడ్స్ బాధితుల సంఖ్యపై ఆరా తీశారు. వారికందుతున్న వైద్యం, కౌన్సిలింగ్, ఎన్జీవోల సహకారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఎన్జీవోల సహకారంతో ఎయిడ్స్ బాధితులను ఎప్పటికప్పుడు గుర్తిస్తూ వారికి సరైన చికిత్స, కౌన్సిలింగ్ అందిస్తే హెచ్ఐవి వ్యాప్తిని అరికట్టొచ్చని సూచించారు. ఎయిడ్స్ రోగుల వివరాలు, చికిత్సను గోప్యంగా ఉంచుతూ వారి నడవడిక, కదలికలను గమనించాలని తెలియజేశారు. షేర్ ఇండియా ఎన్జీవో సంస్థ నిర్వాహకులు డాక్టర్ రాజేంద్రప్రసాద్, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి, ఆర్ఎంఓ డాక్టర్ మధు, డిప్యూటీ పిఎంఓ జెబు తదితరులు పాల్గొన్నారు.

స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులు గడువులోపు పూర్తవ్వాలి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్



స్మార్ట్ సిటీ నిధులతో తిరుపతి నగరంలో జరుగుతున్న ప్రాజెక్టులు గడువులోపు పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ మేనేజింగ్ డైరెక్టర్, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. స్మార్ట్ సిటీ నిధులతో జరుగుతున్న వివిధ ప్రాజెక్టుల పనుల పురోగతిపై నిర్మాణ సంస్థల ప్రతినిధులు, స్మార్ట్ సిటీ అధికారులతో మంగళవారం మేనేజింగ్ డైరెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్, సిటీ ఆపరేషన్ సెంటర్, గరుడ వారధి, మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, గ్లో గార్డెన్, క్రికెట్ స్టేడియం తదితర ప్రాజెక్టుల్లో జరుగుతున్న పనుల వివరాలను వివరించారు. గరుడ వారధిలో పెండింగ్ లో ఉన్న పనులు త్వరగా పూర్తి చేయాలని ఆ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ముఖ్యంగా కొర్లగుంట వద్ద పెండింగ్ లో ఉన్న డ్రైనేజీ కాలువల నిర్మాణం పూర్తి చేయాలని, న్యాయపరమైన సమస్యలను పరిష్కరిస్తామని అన్నారు. వినాయక సాగర్ లో గ్లో గార్డెన్ పనులు పూర్తి చేయాలని అన్నారు. క్రికెట్ స్టేడియంలో పెండింగ్లో ఉన్న పనులు పూర్తి చేసి, ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అన్నారు. ఈ సమావేశంలో స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్ పాల్గొన్నారు.

అఖండ శివ సంకీర్తనలు ప్రారంభం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయంలో భక్తకన్నప్ప జానపద కళాక్షేత్రం, అన్నమయ్య కళాక్షేత్ర పీఠం ఆధ్వర్యంలో ఈనెల15 వ తేదీ నుండి అఖండ శివ నామ సంకీర్తనలు చేసుకునేందుకు ఈవో అనుమతులు ఇచ్చారని అన్నమయ్య కళాక్షేత్ర పీఠం కార్యదర్శి సంక్రాంతి వెంకటయ్య అన్నారు. ఆలయ 2వ గేటు వద్ద ఉన్న వేదిక పైన ప్రతిరోజూ అఖండ శివనామ సంకీర్తన నిత్య భజనలు కార్యక్రమం జరుపుకునే అవకాశం స్థానిక ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి ఇవ్వడం పట్ల మంగళవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థినుల హాస్టల్స్ ఆకస్మిక తనిఖీ

క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని విద్యార్థినిల హాస్టల్స్ వంటశాలను, మెస్సును ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య మాదాల భూపతి నాయుడు తనిఖీలు నిర్వహించారు. తయారైన ఆహార పదార్థాలను రుచి చూసి, వంటశాల, మెస్ నూ పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థినిలతో వారు మాట్లాడుతూ ఆహారాన్ని వధా చేయొద్దని, ఆహారం విషయంలో సమయపాలన పాటించాలనీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్వీయు సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కేటి రామకష్ణారెడ్డి, వార్డెన్లు ఆచార్య నాగజ్యోతి, లక్ష్మీ దేవమ్మ పాల్గొన్నారు.



ప్రమాదాల నివారణకు చర్యలు : కలెక్టర్

తిరుపతి సిటీ : జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు సంబంధిత శాఖలు సమన్వయంతో పక్కా ప్రణాళికతో కృషి చేయాలని, తిరుపతి పట్టణంలో భారీ వాహనాలకు అనుమతి సమయాలను సమీక్షించాలని, ద్విచక్ర వాహనాల చోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బా రాయుడు సంయుక్తంగా పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం జిల్లా కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా జిల్లా రహదారి భద్రతపై సమీక్ష సమావేశం వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో సంబంధిత అధికారులతో నిర్వహించారు. ఈ సమావేశము నందు తిరుపతి జిల్లాలో రహదారి ప్రమాదాలకు గల కారణాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా రవాణా శాఖ అధికారి మురళి మోహన్ పాల్గొన్నారు.

పంచాయతీల్లో ఆదాయ వనరులు పెంచుకోవాలి

పుత్తూరు టౌన్: పంచాయతీల్లో ఆదాయ వనరులను పెంచుకునేలా అందరూ కలసి భాగస్వామ్యం కావాలని జిల్లా ఉప పంచాయతీ కార్యనిర్వహణాధికారి జుబేదా తెలిపారు. మండల అభివృద్ధి కార్యాలయంలో మంగళవారం సర్పంచులకు, పంచాయతీ కార్యదర్శులకు శిక్షణా తరగతులు జరిగాయి. ఎంపిపి ఎ.మునివేలమ్మ అధ్యక్షత వహించారు.

రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు అత్తూరు సిరి

రామచంద్రాపురం: కుప్పం బాదూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదవ తరగతి విద్యార్థిని అత్తూరు సిరి రాష్ట్రస్థాయి క్విజ్ పోటీలకు ఎంపికైయింది. మంగళవారం విద్యార్థిని సిరిని ప్రధానోపాధ్యాయులు సుజనీ కుమారి ఉపాధ్యాయులు అభినందించారు. ఈనెల 30వ తేదీన విజయవాడలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు.



ఇళ్లపక్కనే చెత్తాచెదారం

పన్నులు సరే...కాల్వలెక్కడ..?

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

తాగునీరు, వీధిదీపాలు, కుళాయి, ఖాళీజాగా, చెత్త పన్ను ఇలా రకరకాలుగా పన్నుల రూపంలో మున్సిపాలిటీ విధిస్తూ లక్షలాది రూపాయలు ప్రజలపై భారం మోపుతోంది. ఎవరైనా కట్టకపోతే నోటీసులు ఇస్తూ ముక్కుపిండి మరీ వసూలు చేస్తోంది. అయితే ప్రజలకు మౌలిక వసతులు కల్పించడంలో ఏమాత్రం చొరవ చూపడం లేదన్న విమర్శలున్నాయి. పన్నులు వసూలు చేసే అధికారులు మౌలిక వసతులు కల్పించడం లేదంటూ మండిపడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిస్తేనే నివాసాల మధ్య నీరు నిలిచిపోయి, పాచిపట్టి, దోమలకు నిలయంగా మారుతోంది. దోమకాటుకు జ్వరాలు, డెంగ్యూ, మలేరియా జ్వరాలతో ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నారు. వర్షపునీరు నిలిచిన ప్రాంతాల్లో నీటిని తొలగించి, బ్లీచింగ్ చల్లి ప్రజలు వ్యాధుల బారిన పడకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు. డ్రైనేజీ కాల్వలు నిర్మించి, సిమెంట్‌రోడ్లు వేయాలని, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ఫిట్ ఇండియా సైక్లింగ్ ఉద్యమం ప్రారంభం

క్యాంపస్ :యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ మంత్రిత్వ శాఖ ద్వారా ఫిట్‌నెస్‌పై దృష్టి సారించి కాలుష్యాన్ని తగ్గించే దిశగా ఫిట్ ఇండియా సైక్లింగ్ ఉద్యమం మంగళవారం శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో ప్రారంభించినట్లు విసి ఆచార్య ఉమ, రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. రజని తెలిపారు. ఈ సైకిల్ ర్యాలీలో 300 విద్యార్థినిలు పాల్గొన్నారు. వ్యాయామ విద్య విభాగాధిపతి సారా సరోజినీ పాల్గొన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లపై టీటీడీ ఈఓ సమీక్ష

తిరుమల : వైకుంఠ ఏకాదశి పురస్కరించుకుని శ్రీవారి ఆలయంలో వచ్చే ఏడాది జనవరి 10 నుండి 19వ తేది వరకు నిర్వహించనున్న వైకుంఠ ద్వార దర్శన ఏర్పాట్లపై మంగళవారం సాయంత్రం టీటీడీ ఈవో జె.శ్యామలరావు అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్యతో కలిసి తిరుమలలోని అన్నమయ్య భవనంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈనెల 23న శ్రీవాణి టికెట్లు, 24న ఎస్ఇడి టికెట్లను ఆన్‌లైన్‌లో విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈఓ వీరబ్రహ్మం, సీవీఎస్వో శ్రీధర్ పాల్గొన్నారు.

కరోనా వారియర్స్‌పై లేదా కనికరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి కరోనా కష్టకాలంలో ప్రాణాలకు తెగించి ప్రజలకు సేవ చేసిన రోజువారీ వేతన కూలీల పట్ల శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారులకు ఏమాత్రం కనికరం లేదా అంటూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కల్లూరు జాన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐదేళ్లు వారి చేత వెట్టి చాకిరీ చేయించుకుని తీరా వద్దు పొమ్మంటే వారి బతుకులు ఏమి కావాలని ప్రశ్నించారు. శ్రీకాళహస్తి మున్సిపాలిటీ పరిధిలో కరోనా కాలం నుంచి పని చేస్తున్న 24 మంది రోజువారి కూలీలను విధుల్లోకి తీసుకోవాలంటూ, వారికి పెండింగ్ వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఏఐటీయూసీ అనుబంధ ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు అధ్యక్షులు మురళి, జనమాల గురవయ్య, గోపి పాల్గొన్నారు.

వీధిన పడేశారు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి మున్సిపల్ అధికారుల తీరు నానాటికీ తీసికట్టుగా మారుతోంది. వీరు తీసుకుంటున్న నిర్ణయాల పట్టణ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. అనవసర పనుల్లో జోక్యం చేసుకోవడం, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవడంలో విఫలమవుతున్నారన్న విమర్శలు వస్తున్నాయి. పట్టణంలోని కూరగాయల మార్కెట్ సమీపంలోని కాలువపై సుమారు 20 కుటుంబాల వారు వీధి వ్యాపారాలు చేసుకునే వారు. వీరు వ్యాపారాలు చేసుకునేందుకు ప్రత్యామ్నాయ స్థలం చూపుతామని చెప్పి నెల రోజుల కిందట బంకులు ఖాళీ చేయించి విద్యుత్ సరఫరా తీసేశారు. వీధి వ్యాపారులు నెల రోజులుగా మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోకుండా కాలయాపన చేస్తుండడంతో మంగళవారం బాధిత వీధి వ్యాపారులు స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు.